అమ్మభాషను మరువొద్దు



వట్టెం నవోదయ విద్యాలయంలో..

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సత్య సాయి సేవా మందిరంలో తెలంగాణ తెలుగు సబ్జెక్టు ఫోరం, రాష్ట్రీయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా స్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి ఏ. రమేష్‌కుమార్ హాజరై మాట్లాడారు. తెలుగు భాష చాలా మహోన్నతమైందన్నారు. భాష ఔన్నత్యాన్ని ముందు తరాలకు అందించాలన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతి, ప్రశంసాపత్రం అందించారు. రాష్ట్రీయ పండిత పరిషత్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, ఏఎంఓ కురుమయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగు అధ్యాపకులు రాఘవేందర్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ అంజయ్య హాజరై మాట్లాడారు. తెలుగు భాష అమ్మలాంటిదన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వనిత, అధ్యాపకులు కోదండ రాములు, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

తాడూరు: మండలంలోని సిర్సవాడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు డీఈఓ రమేష్ కుమార్ బహుమతులు అందజేశారు. జీహెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయుడు సత్యనారాయణ ఉన్నారు.



నాగర్‌కర్నూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

ఘనంగా మాతృభాష దినోత్సవం

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం మాతృభాష దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.వెంకటేష్‌లు మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

నవోదయలో విద్యాలయంలో..

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు భాష విభాగ అధిపతి రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ పి. భాస్కర్‌కుమార్, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వికాస తరంగిణి ఆధ్వర్యంలో..

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో రామాలయం ప్రధాన అర్చకులు రామాచారిని, ప్రముఖ గాయకుడు మల్లెకిడి పాండును సన్మానించారు. గాయకుడు ఆలపించిన పాటలు పలువురిని అలరించాయి. చెన్నంపల్లి పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు పోల సాయిజ్యోతి విద్యార్థులకు పలకలు, ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికాస తరంగిణి ప్రతినిధులు అశోక్‌కుమార్, జంగయ్య, వెంకటేష్, శివాచారి, హెచ్‌ఎం కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్ ప్రభుత్వ పీజీ కళాశాలలో..



లింగాల మండలం చెన్నంపల్లిలో..

భక్తిశ్రద్ధలతో ఇరుముడి పూజలు

ఉప్పునుంతల/వెల్దండ/దోమలపెంట: స్థానిక కేదారేశ్వరాలయం ఆవరణలో శుక్రవారం శివస్వాముల ఇరుముడి పూజలు నిర్వహించారు. ఉదయం శివుడికి అభిషేకాలు చేసి మంగళహారతులు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివమాలధారులు శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. ఆలయం ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఊరేగింపుగా స్వాములను శ్రీశైలం పుణ్యక్షేత్రానికి సాగనంపారు. కార్యక్రమంలో స్వాములు బాలనారి, కాశీం, రేణయ్య, అంజనేయులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వెల్దండ మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన శివమాలధారులు ఇరుముడులతో శ్రీశైలం బయలుదేరారు. శివదీక్షలు చేసిన స్వాములు శ్రీశైలం దర్శనానికి పాదయాత్రగా వెళ్లారు. దోమలపెంటలో భాగ్యనగర్ శివ దీక్షా సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం చేశారు.



వెల్దండ మండలం చెర్కూర్ నుంచి శ్రీశైలం బయలుదేరిన శివస్వాములు

ఉపాధి హామీ పనుల తనిఖీ

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఏపీఓ నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ రంజిత్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీలో చేపడుతున్న కాలువ పూడికతీత పనులను సద్వినియోగం చేసుకోవాలని కొలతల ప్రకారం పనులు చేసి ప్రతి రోజు రూ.300లు వచ్చేలా పనులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



చారకొండ: మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్–2 తనిఖీల్లో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సారంబండతండాకు చెందిన నవీన్ బొలేరో వాహనంలో 15 కింటాళ్ల రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తున్నాడు. గోకారం సమీపంలో పోలీసులకు పట్టుబడ్డాడు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన శారదమ్మ తమ ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉందన్న పక్కా సమాచారం మేరకు అధికారులు సోదాలు జరిపి, 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నవీన్, శారదమ్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ వెంకటేశం, సీఐ పాండరీ, ఎస్‌ఐలు వెంకటేశ్వర్ రావు, సాంబశివుడు, హెడ్ కానిస్టేబుల్ శ్రీశైలం గౌడ్ తెలిపారు.

ప్రతిఒక్కరు సేవాభావం కలిగి ఉండాలి



కొల్లాపూర్: ప్రతిఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని ప్రజావికాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు కలమంద శేఖర్ కోరారు. సేవా సంస్థ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్న అంబలి కేంద్రం, అన్నదానం కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బండారి రామకృష్ణ, కేతేపాగ మధు, పసుపుల కురుమయ్య, శీలం వెంకటేష్, కురుమయ్య, జగదీష్, గౌస్, సురేష్ తదితరులు ఉన్నారు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు వీడ్కోలు



వెల్దండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శుక్రవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోపాల్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థులు చదువులో రాణిస్తేనే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. అనంతరం విద్యార్థినులు సంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి

వెల్దండ: రైతులు పంటల సాగు వివరాలను నమోదు చేయించాలని మండల వ్యవసాయ అధికారిణి శోభారాణి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొట్ర క్లస్టర్‌లో ఏఓ పంటల నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులందరు సాగుచేసిన వరి, మొక్కజొన్న, ఆముదం తదితర పంటలను ఆన్‌లైన్ చేయించాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంటలకు మాత్రమే నష్టపరిహారం అందుతుందన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓలు గణేష్, సురేష్, ప్రవీణ్, డాక్యానాయక్, బిన్నతి, విజయలక్ష్మి, ప్రసన్నలక్ష్మి, అభిబూనిస్సా తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ పనులపై గ్రామసభ

తాడూరు: ఉపాధిహామీ పనుల నిర్వహణపై శుక్రవారం ఎంపీడీఓ ఆంజనేయులు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. 2023–24 సంవత్సరానికి గాను 24 పనులు చేపట్టారు. రూ. 24,91,650 ఖర్చుతో చేసినటువంటి పనులను పరిశీలించిన అనంతరం గ్రామసభ నిర్వహించారు. డీఆర్పీ బాల్‌రాజు, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ అనంత్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్పీ బాల్‌రాజు

బీమాపై అవగాహన



వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో పోస్టాఫీసులోని ప్రమాద బీమా, సాధారణ బీమాలపై శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. నాగర్‌కర్నూల్ ఎగ్జిక్యూటివ్ ఫీసర్ నిషానా హాజరై మాట్లాడారు. 16 సంవత్సరాల నుంచి 65 ఏళ్ల వరకు ప్రమాదబీమా పాలసీలను చేసుకోవచ్చన్నారు. అర్హులైనవారు టాటాఅగ్రి కంపెనీలో రూ.520 చెల్లిస్తే ఏడాది పాటు రూ.10 లక్షలబీమా వర్తిస్తుందన్నారు. అలాగే అదిత్యబిర్లాక్యాపిటల్, రిలయన్స్ జనరల్ ఇన్స్‌రెన్స్, నీవా హెల్త్ ఇన్సూరెన్స్, బాజాజ్ అల్జాన్ జనరల్ ఇన్స్‌రెన్స్, స్టార్ హెల్త్‌ఇన్సూరెన్స్‌ల గురించి వివరించారు. పూర్తి వివరాలకు పోస్టాఫీసుల్లో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో బైరాపూర్ బీపీఎం అఫ్రీద్ తదితరులు ఉన్నారు.

తపాలా ప్రమాద బీమా పథకాలపై..

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకారుపాములలో 23వ పోలింగ్ బూత్‌లో బీజేపీ బూత్ అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం తపాలా ప్రమాద బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరానికి రూ.755 రూపాయలు చెల్లిస్తే రూ.15 లక్షల వరకు బీమా వర్తిస్తుందన్నారు. భీమేష్, మద్దిలేటి, జి శివ, ఎం రాజు, ఎం శివ, బి మల్లేష్, జి రమేష్, బి శివ, నరేష్, కిరణ్ పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో రెడ్‌బుక్ డే

కొల్లాపూర్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం రెడ్‌బుక్ డే కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పిలుపుమేరకు స్టడీ సర్కిల్, పార్టీ సెంట్రల్ కమిటీ ఇచ్చిన రాజకీయ తీర్మానం ముసాయిదాను సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ చదివి వినిపించారు. కార్యక్రమంలో నాయకులు తారాసింగ్, సలీం, బాలునాయక్, రాజు, రాముడు, చంద్రునాయక్ తదితరులు ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం

కందనూలు: దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని విద్యా భారతి దక్షిణ మధ్య సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వర్ రావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సరస్వతీ శిశు మందిర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన విద్యాసదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పౌరుడు దేశభక్తి కలిగి ఉండాలని, మనదేశం యొక్క గొప్పతనాన్ని భావితరానికి తెలియజేయాలని, భారతీయులంతా ఐకమత్యంగా మెలుగుతూ దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాలమూరి విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సరస్వతీ విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు మిడిదొడ్డి శివశంకర్, సహాయ కార్యదర్శి నాగరాజు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఉమామహేశ్వర్‌రావు

బైక్ చోరీ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని గాంధీనగగర్ కాలనీలో బైక్ చోరీ అయిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన శ్రీను పట్టణంలో గాంధీనగర్‌లో నివాసం ఉంటూ ఫాస్ట్‌ఫుడ్ నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే పనిని ముగించుకొని ఇంటి ఎదుట బైక్‌ను పార్కు చేశాడు. శుక్రవారం ఉదయం చూసేసరికి బైక్ కనపడకపోవటంతో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు భావించి బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



తిమ్మాజిపేట: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. లోఓల్టేజి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు దానం బాల్‌రాజ్, షేక్ ముబారక్, మైనార్టీ మండల కార్యదర్శి షేరు, ఖాజామైనోద్దీన్, టింకు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పాన్‌గల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. హెచ్‌సీ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిష్టాపూర్‌తండాకు చెందిన బద్దెలి (79) ఈనెల 5వ తేదీన కుమారుడి బైక్‌పై పాన్‌గల్ ఈదమ్మ గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇంటి సమీపంలో నడుచుకుంటూ వెళ్తూ కళ్లు తిరిగి సీసీ రోడ్డుపై కిందపడటంతో తల వెనుక భాగంలో బలమైన గాయం తగిలింది. వెంటనే జిల్లా ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఘటనపై మృతురాలి కుమారుడు బాబునాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ పేర్కొన్నారు.

పరీక్ష ప్యాడ్ల వితరణ

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్యాడ్లను వితరణగా అందజేశారు. క్లబ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు తల్లి కీర్తిశేషులు రామచంద్రమ్మ కల్వరాల పాఠశాల పూర్వ విద్యార్థి కావడంతో ఆమె జ్ఞాపకార్థం విద్యార్థులకు ప్యాడ్లు అందజేసినట్లు తెలిపారు.

24న 'చలో కొండారెడ్డిపల్లి'



పెంట్లవెల్లి: ఈ నెల 24న చలో కొండారెడ్డిపల్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకులు ఈశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చారకొండ మండల కేంద్రంలో రాష్ట్రం ప్రభుత్వం బలవంతంగా పేదల ఇళ్లను కూల్చిందన్నారు. బాధితులు నష్ట పరిహారం కోసం 12 రోజులుగా రిలే నిరహార దీక్షలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చలించడం లేదు. దీంతో బాధితులకు న్యాయం కోసం చలో కొండారెడ్డిపల్లి కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామన్నారు. హనుమంతు, శ్రీనివాసులు, చిట్టెమ్మ, గోవిందమ్మ పాల్గొన్నారు.

బాధితుల సమస్యలు పరిష్కరించాలి

తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ మండల కేంద్రంలో జాతీయ రహదారి బైపాస్ బాధితుల సమస్యలు పరిష్కరించి ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి కాశన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తునట్లు పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు బాలరాజు, వెంకటస్వామి, ఎ కాశన్న పాల్గొన్నారు.

సీఎం ఇంటిని ముట్టడిస్తాం

తెలకపల్లి: ఈ నెల 24న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణం కోసం చారగొండ మండల కేంద్రంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు నష్ట పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదిర్శి గోపాస్ లక్ష్మణ్, విజయ్‌గౌడ్, నందిపేట భాస్కర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు



కల్వకుర్తి రూరల్: మండలంలోని జీడిపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం గ్రంథాలయం ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ఎంఈఓ శంకర్ నాయక్ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయుడు రఘు రామారావు మాట్లాడుతూ దాతల సహకారంతో రూ.26 వేలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటరమణ, మాజీ సర్పంచ్ భీమ్లా నాయక్, ఏఎస్ఐ హనుమంత్ రెడ్డి, కల్యాణ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలు పెండింగ్‌లో ఉంచొద్దు



పెద్దకొత్తపల్లి: భూసమస్యలు పెండింగ్‌లో ఉంచొద్దని కొల్లాపూర్ ఆర్డీఓ బన్సిలాల్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ధరణిలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల ఫైల్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జేకే మోహన్, డిప్యూటీ తహసీల్దార్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిమాండ్ చేస్తూ శుక్రవారం తీన్మార్ మల్లన్న టీం ఆధ్వర్యంలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న టీం అధ్యక్షుడు పరశురామ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను సర్వే నిర్వహించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గోరెట్ల సతీష్, శివ, హుస్సేన్ పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ సైన్స్ వారోత్సవాలు

పాన్‌గల్: ఈనెల 28వ తేదీన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 22వ తేదీ నుంచి సైన్స్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైస్కూల్ విభాగంలో 'మా ప్రయోగశాల – పరికరాల పరిచయం' ఈ పోటీలో పాల్గొనే విద్యార్థులు పాఠశాలలోని ప్రయోగశాలలో ఉన్న పరికరాలను (టెస్టు ట్యూబ్‌తో మొదలు పెట్టుకొని ఏదైనా సరే) పరిచయం చేస్తూ వివరించాలని, పాఠశాల నుంచి ఒక విద్యార్థి మాత్రమే పాల్గొనాలని సూచించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ఉపన్యాస పోటీ 'డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం–స్ఫూర్తి' విద్యార్థులు నల్లబల్లపై వివరాలు రాసి ఇచ్చిన అంశంపై ఉపన్యసిస్తూ దాన్ని వీడియో రికార్డు చేసి పంపించాలి. విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

క్లుప్తంగా

రైతులకు స్ప్రింక్లర్ల పంపిణీ



వెల్దండ: మండలంలోని రాచూర్‌లో శుక్రవారం ప్రభుత్వం రైతులకు సబ్సిడీలో మంజూరు చేసిన స్ప్రింక్లర్ల పైపులను కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రైతులకు స్ప్రింక్లర్లు మంజూరు అయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. సబ్సిడీలో వ్యవసాయ పరికరాలను అందించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, డీలర్ శ్రీధర్‌రెడ్డి, రైతులు కృష్ణయ్య, లక్ష్మయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.

అపార్ ఐడీని జనరేట్ చేయాలి



లింగాల: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అపార్ ఐడీని తప్పనిసరిగా జనరేట్ చేయాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కోమటికుంట, జీల్గుపల్లి, దత్తారం పాఠశాలలను ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలకు సంబంధించిన పలు రకాల రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల యొక్క సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ సీఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌వీకేఎస్ డైరీ ఆవిష్కరణ



దోమలపెంట: రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం నూతన డైరీని శుక్రవారం ఆ సంఘం ప్రాంతీయ నాయకులు భూగర్భ కేంద్రం సీఈ రామసుబ్బారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు తిరుపతి, రాము, చంద్రశేఖర్, ఎస్‌కే భాష, నాగులు, బొంతశ్రీను, రమణారెడ్డి, సీఈతో మాట్లాడుతూ మృతి చెందిన ఆర్టిజన్లకు సంబంధించి రావలసిన గ్రాట్యుటీ త్వరతిగతిని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సీఈకి విన్నవించారు. దీనికి సీఈ సానుకూలంగా స్పందించారు.

ఆలయంలో మరమ్మతు పనులు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని కైలాసం గుట్టపై ఉన్న వేంకటేశ్వర స్వామి దేవాలయం, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో శుక్రవారం హిందూ ఐక్యవేదిక సభ్యులు మరమ్మతు పనులు చేపట్టారు. రూ.2 లక్షల వ్యయంతో పనులను ప్రారంభించారు. రాళ్లు, గడ్డి, చెత్తాచెదారం తొలగించారు. ఆలయ పైకప్పులపై సిమెంటుతోపాటు పెయింట్ పనులు చేశారు. ఆలయాలకు వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేశారు. శివరాత్రి సందర్భంగా కైలాసం గుట్టపై ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శివరాత్రి నాటికి పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు హిందూ ఐక్యవేదిక నాయకులు చెప్పారు.

అందుబాటులో యూరియా



కొల్లాపూర్: మండలంలోని రైతుల అవసరాలకు సరిపడా యూరియా అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి చిన్నహుస్సేన్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నార్లాపూర్, రామ్‌నాయక్‌తండా, లచ్చనాయక్ తండా, ముక్కిడిగుండం, మొలచింతలపల్లి గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలు పరిశీలించారు. సాగు విధానాల గూర్చి రైతులతో మాట్లాడారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కొల్లాపూర్ సింగిల్‌విండో కార్యాలయంలో 694 బస్తాలు, మాచినేనిపల్లి సింగిల్ విండో కార్యాలయంలో 1,261 బస్తాలు, కొల్లాపూర్ ఆగ్రోస్‌లో 819 బస్తాలు, ప్రైవేటు డీలర్ల వద్ద 1,666 బస్తాల యూరియా నిల్వ ఉన్నట్లు తెలిపారు.